క్లుప్తంగా

సంగమేశ్వరాలయంలో డీటీసీ ప్రత్యేక పూజలు



పూజల్లో డీటీసీ చంద్రన్ దంపతులు

సంగం: సంగంలోని సంగమేశ్వరస్వామి ఆలయాన్ని జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.చంద్రన్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపీఐ రాములు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలు సంఘటితం కావాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి



మాట్లాడుతున్న పరంజ్యోతి

ఉదయగిరి: సమాజంలో అణగారిన వర్గాలు సంఘటితమై రాజ్యాధికార దిశగా ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి అన్నారు. ఉదయగిరిలో శుక్రవారం పార్టీ రాజకీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనాభాలో 80 శాతం మంది ఉన్న నిమ్న జాతుల ప్రజలందరిని ఏకం చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఇన్‌చార్జి శ్రీరాములు, కన్వీనరు ఆత్మకూరు ప్రకాశరావు పాల్గొన్నారు.

వంద హెక్టార్లలో సీడ్‌బాల్స్



సీడ్స్ చల్లేందుకు డ్రోన్లు వదులుతున్న అధికారులు

ఉదయగిరి: ఉదయగిరి రేంజ్ పరిధిలో తొలి విడతలో అటవీ ప్రాంతాల్లో వంద హెక్టార్లలో డ్రోన్ల ద్వారా సీడ్‌బాల్స్ చల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఉదయగిరి రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. విత్తనోత్పత్తి సంస్థ కింజెంటా సహకారంతో సీడ్స్ బాల్స్ చల్లకాన్ని ప్రారంభించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతం దట్టంగా లేని ప్రాంతాల్లో దానిని పెంపొందించే నిమిత్తం సీడ్ బాల్స్ చల్లడం జరుగుతుందన్నారు. వీటిలో సీతాఫలం, నేరేడు, కుంకుడు, చింత, ఉసిరి, తదితర జాతుల విత్తనాలు చల్లుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసులు, ఎఫ్‌బీఓలు ఓం ప్రకాష్, లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అయోధ్య అక్షితలు ఊరేగింపు



ఉదయగిరి: వచ్చే నెలలో అయోధ్యలోని రామ మందిరానికి ప్రాణప్రతిష్ట చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయగిరిలో శ్రీరాముడి అక్షితల ఊరేగింపు జరిగింది. శ్రీరామ జన్మభూమి క్షేత్ర కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన రామ భక్తులు ఊరేగింపుగా అక్షితలను శివాలయానికి చేర్చారు. జనవరి 22న అక్షితలను ఉదయగిరి ప్రాంతంలోని అన్ని గ్రామాలకు చేర్చి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆర్‌బీకేల్లో పుష్కలంగా ఎరువులు

- జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి



చెర్లోయడవల్లిలో రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

ఆత్మకూరురూరల్: జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి అన్నారు. మండలంలోని చెర్లోయడవల్లి, రామస్వామిపల్లి రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక రైతులతో వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఎరువుల లభ్యత, విత్తనాల పంపిణీ, తదితర అంశాలపై వారికి వివరించారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నీటి వనరులు తక్కువగా అందుబాటులో ఉన్న ప్రాంతాలను వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. పత్తి, పెసర, నువ్వులు, శనగ, తదితర స్వల్ప కాలిక పంటలు తక్కువ విస్తీర్ణంతోనే అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ, ఏఓ కిషోర్‌బాబు, విస్తరణాధికారి కోనేపల్లి కృష్ణవేణి, ఆయా ఆర్‌బీకేల వ్యవసాయ సహాయకులు బీబీ ఆయేషా, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వంచకుడు బాబు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రభుత్వాలు పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉండాలనే ప్రాథమిక సూత్రాన్ని పూర్తిగా విస్మరించి పేదలను అన్ని రకాలుగా వంచించిన దగాకోరు చంద్రబాబు అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని 20వ వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద పిల్లలు చదువుకోకూడదని చంద్రబాబు హయాంలో దాదాపు రాష్ట్రంలో 6 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసేశాడన్నారు. జీఓలే లేకుండా రాష్ట్రంలో 2 వేల హాస్టళ్లను మూత వేశాడని గుర్తు చేశాడు. పేదల పిల్లలకు ఇంగ్లిష్ చదువు బోధించడానికి వీల్లేదని చంద్రబాబు తన మనుషులతో కోర్టుల్లో పిటిషన్లు వేయించాడన్నారు. పేదల విద్య, ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధిని చంద్రబాబు చిన్నాభిన్నం చేశాడని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సరికొత్త సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టారన్నారు. పేదల కోసం కార్పొరేషన్లు పెట్టి వాటి ద్వారా ఆయా అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఐదేళ్ల చంద్రబాబు హయాంలో ఎస్సీలకు రూ.33,000 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో రూ.66,000 కోట్లు ఖర్చు చేశారని వివరించారు. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములపై అనాదిగా ఎలాంటి హక్కులు లేకుండా సాగు చేసుకుంటున్న పరిస్థితి ఉండేదని, అలాంటి భూముల్ని గుర్తించి సుమారు 22 వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి, వారికి సంపూర్ణ హక్కులు ప్రసాదించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతోందన్నారు. చంద్రబాబు హయాంలో 12 శాతం ఉన్న పేదరికం ప్రస్తుతం 6 శాతానికి తగ్గిందన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీలు చేసేందుకు తీర్మానం చేసిన చరిత్ర వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కే దక్కుతుందని చెప్పారు. రాష్ట్రంలో 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాల్ని పంపిణీ చేస్తుంటే అడుగడుగునా మోకాలడ్డారని, అమరావతిలో 50 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే కోర్టుల్ని ఆశ్రయించారన్నారు. నాయకులు బోగిరి విన్సెంట్, తిరువీధి ప్రసాద్, గిరిబాబు, రాయపాటి దిలీప్ కుమార్, పృధ్వీ, ప్రమోద్, ఆనంద్ పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్ బాలాంజనేయులు

అల్లూరు: అల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఈ–స్టాంపింగ్ జరిగే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారని, దానిపై కూడా విచారణ చేపడుతున్నట్లు వివరించారు. ఆయన వెంట అల్లూరు రిజిస్ట్రార్ ప్రసన్నలక్ష్మి ఉన్నారు.

టీడీపీకి ఆర్య వైశ్యులు బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న ఆర్యవైశ్య నాయకులు

- ఆర్యవైశ్య నేతల ఆగ్రహం

కావలి: ఆర్యవైశ్యులను టీడీపీ నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాల్లోకి తీసుకురావడం సిగ్గు చేటని ఆర్యవైశ్య నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, కావలి డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, కావలి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మామిడి రామకృష్ణ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ అమరా వేదగిరి గుప్తా, కావలి పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షుడు తిరువీధి ప్రసాద్, కావలి బులియన్ మర్చంట్ అధ్యక్షుడు నల్లూరు రమేష్, 39వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వీఎస్ఎంఆర్ మాల్యాద్రి తదితరులు మాట్లాడారు. టీడీపీ నాయకుల కుట్రలో భాగంగా విజయవాడలో ఆర్య వైశ్య పేరుతో టీడీపీలో ఉన్న దూండి రాకేష్ నిత్యం వివాదాలు సృష్టించేలా చేసి, అది రాష్ట్ర ఆర్య వైశ్యుల సమస్య గా చిత్రీకరిస్తుండడం టీడీపీకి ఆనవాయితీ అయిపోయిందన్నారు. అనవసరపు వివాదాలు, రాద్ధాంతాలు వ్యక్తులు మధ్య ఉంటాయే కాని, ఆర్యవైశ్య కులంలోనే ఉన్నట్లు చిత్రీకరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులకు అన్ని రకాలుగా పెద్దపీట వేస్తుండడంతో టీడీపీ తమకు ఆర్యవైశ్య సామాజిక వర్గంలో పుట్టగతులు ఉండవని భయంతో ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేలను, వైఎస్సార్‌సీపీ నాయకులను దూషించడం క్షమార్హం కాదన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆర్య వైశ్యులతో సన్నిహితంగా ఉంటారని, రాజకీయంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్యవైశ్యులకు ఉన్నత స్థానాలను కల్పించారని వివరించారు. ఎమ్మెల్యే దయతో కౌన్సిలర్‌గా ఎన్నికైన అలేఖ్యను తమ అవసరాలకు తిప్పుకుని, ఇప్పుడు టీడీపీ నాయకులను సంతోష పెట్టడానికి ఎమ్మెల్యేపై అసంబద్ధమైన వ్యాఖ్యానాలు చేయిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు కుట్రలు చేసి పబ్బం గడుపుకోవడానికి అన్ని కులాలు అయిపోవడంతో.. ఇప్పుడు తమ ఆర్యవైశ్య కులాన్ని కూడా ఉపయోగించుకోవాలని కుయుక్తలకు తెరలేపడంపై మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ఆర్యవైశ్యులు టీడీపీ తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య నాయకులు బొగ్గవరపు వెంకటేశ్వర్లు, వెలుగూరి నవీన్ కుమార్, మల్లికార్జున, వెంకట సుధాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా జ్యోతి బాధ్యతల స్వీకరణ



అల్లూరు: అల్లూరు ఎంపీడీఓగా వి.జ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలానికి చెందిన ఆమె ఇటీవల గ్రూప్–2లో సెలెక్ట్ అయి ఎంపీడీఓగా మొదటి పోస్టింగ్ అల్లూరు కావడం విశేషం. ఆమె మాట్లాడుతూ మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసి శ్రీదేవి ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె స్థానంలో జ్యోతిని నియమించారు. ఎంపీడీఓకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

పాతాళపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేస్తున్న సర్పంచ్ బిజివేముల ఓబుల్‌రెడ్డి

సోమశిల: అనంతసాగరం మండలం పాతాళపల్లిలో శుక్రవారం సర్పంచ్ బిజివేముల ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మాగుంట కృషితో రక్తకేంద్రాలు



మాగుంట చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి: దివంగత మాగుంట సుబ్బరామరెడ్డి స్ఫూర్తితో నెల్లూరు, ప్రకాశం జిల్లాలో రెడ్ క్రాస్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్ అన్నారు. శుక్రవారం రెడ్‌క్రాస్ ప్రాంగణంలో మాగుంట చిత్ర పటానికి నివాళులర్పించారు. రవిప్రకాష్ మాట్లాడుతూ 90వ దశకంలో నెల్లూరు, ఒంగోలుల్లో రెడ్‌క్రాస్ రక్తకేంద్రాలు ఏర్పడడానికి మాగుంట ప్రోత్సాహమే కారణమన్నారు. మాగుంట పార్వతమ్మ నెల్లూరులో మానసిక దివ్యాంగుల కేంద్రం ఏర్పాటుకు భూరి విరాళం అందించారని, మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి కావలి, కనిగిరి, ఒంగోలు రెడ్ క్రాస్ లకు రక్తకేంద్రాల ఏర్పాటుకు విరాళాలు, అంబులెన్స్‌లు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ ఆనంద్, హరినారపరెడ్డి, జమున, మొగల్ సలీం బేగ్, షమారహీం, స్వాతి, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీకొని ఇద్దరికి గాయాలు

మర్రిపాడు: ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పొంగూరుకండ్రిక అచ్చమాంబగుడి సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడుతో వెళ్తున్న మరో లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

136 మి.మీ. వర్షపాతం నమోదు

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గడిచిన 24 గంటల్లో శుక్రవారం ఉదయానికి 136 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. అత్యధికంగా కలువాయి మండలంలో 38.6 మి.మీ., ఆత్మకూరులో 20.2, చేజర్లలో 13.2, ఉదయగిరి 13.2, అనంతసాగరం 12.8, ఏఎస్‌పేటలో 11.8, సంగంలో 10.2, సీతారామపురంలో 9.4, మర్రిపాడులో 6.6 చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

నేడు మండల సమావేశం

మర్రిపాడు: మర్రిపాడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆత్మకూరు: ముంచుకొస్తున్న తుఫాన్ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో విస్తృత సమాచారం కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ కె మధులత శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు షిఫ్ట్ పద్ధతిలో డిప్యూటీ తహసీల్దారు స్థాయి అధికారితో పాటు వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. పెన్నానది తీర ప్రాంత గ్రామాలైన సోమశిల, పడమటికంభంపాడు, శంకర్‌నగరం, బండారుపల్లి, కనుపూరుపల్లి, అప్పారావుపాళెం, పెరుమాళ్లపాడు, తదితర గ్రామాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులను ప్రత్యేకంగా విధులు నిర్వహించేలా ఆదేశించినట్లు ఆమె తెలిపారు. ఎప్పటికప్పుడు సమాచారం కంట్రోల్ రూమ్‌కు తెలియజేసేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని, పెన్నానదిలో చేపలవేటకు వెళ్లరాదని వివరించారు.

శనగ విత్తనాల పంపిణీ



రైతులకు శనగవిత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

అనుమసముద్రంపేట: మండలంలోని కొండమీదకొండూరు రైతు భరోసా కేంద్రం పరిధిలోని కుప్పురుపాడులో శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి రైతులు శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఒక కిలో శనగ విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడితో విత్తన శుద్ధి చేసుకోవాలని, రక్షక పంటలుగా ఆవాలు, ధనియాలు, బంతి వేయాలని సూచించారు. ట్రైకోడెర్మావిరిడి 2 కిలోలలకు 90 కిలోల చివికిన పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండితో కలిపి 10 రోజులు నీడలో మగ్గబెట్టి పొలంలో చల్లుకోవడం వల్ల ఎండు తెగులును అరికట్టవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీఏ వీ దేవసేనమ్మ, ఏఓ టీ రజనీ, ఏఈఓ కె చిరంజీవి, వీఏఏ సాయినాథ్, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో హెచ్‌ఐవీకి దూరం

- సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్

ఆత్మకూరు: ఎవరైనా సరే అప్రమత్తతతో వ్యవహరిస్తే హెచ్‌ఐవీకి దూరంగా ఉండవచ్చునని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్ అన్నారు. పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో వరల్డ్ ఎయిడ్స్ డే డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, డాక్టర్లతో కలిసి మున్సిపల్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎల్‌వీ రమణయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం ధ్యేయం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మేకపాటి రాజారెడ్డి తదితరులు

- భూహక్కు పత్రాల పంపిణీలో మేకపాటి రాజారెడ్డి

ఉదయగిరి: దేశంలో ఏ సీఎం చేయనన్ని రైతు సంక్షేమ పథకాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. ఉదయగిరిలో శుక్రవారం శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు ఎంతో మేలు చేసి వారి గుండెల్లో ఒక ముద్ర సంపాదించగా ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అంతకుమించి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యంగా ఇరవై ఏళ్ల క్రితం పంపిణీ చేసిన అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన లబ్ధిదారులకు శాశ్వత భూహక్కు పత్రాలు అందజేయడం ఎంతో మంచి పరిణామమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఈ పథకం అమలు చేయలేదన్నారు. దీంతో లబ్ధిదారులు తమ భూములను తమ అవసరాల నిమిత్తం విక్రయించుకునే వెసులుబాటు వస్తుందన్నారు. రైతు సంక్షేమంతో పాటు సమాజంలోని వివిధ వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనేనన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పరంగా రాష్ట్రాన్ని దేశంలోనే ఒక గుర్తింపు వచ్చేలా పాలన చేస్తున్నారన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎంతో మంది భూమి లేని రైతులకు పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం మండలంలో 245 మంది రైతులకు 365 ఎకరాలకు సంబంధించిన శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం, జిల్లా కోఆప్షన్ సభ్యుడు షేక్ గాజుల తాజుద్దీన్, స్థానిక నేతలు మూలె వెంకటసుబ్బారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, గడియాల్ని ఎస్దాని, మట్ల లక్ష్మయ్య, కల్లూరి కృష్ణారెడ్డి, షేక్ ఎస్దాని, తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడులో..

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మేకపాటి రాజారెడ్డి 1,738 మంది రైతులకు 3,608 ఎకరాల భూములకు సంబంధించి శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా వింజమూరు, వరికుంటపాడు మండలాల్లోని రైతులకు ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ పత్రాలు పంపిణీ చేశామన్నారు. సాగు చేసుకుంటున్న భూమి లేని ప్రతి రైతుకు డీ–ఫారం పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.వెంకటలక్ష్మమ్మ, సొసైటీ అధ్యక్షుడు జి.ఆంజనేయులు, స్థానిక సర్పంచ్ దిలీప్, వైస్ ఎంపీపీ సీహెచ్ మధు, జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, నేతలు షేక్ అలీఅహ్మద్, ఎం.తిరుపతినాయుడు, మాగంటి సిద్ధయ్య, తహసీల్దార్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు,



అల్లూరు: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి ప్రచార కిట్‌లను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, నాయకులు ఊటు శ్రీకాంత్‌రెడ్డి, షేక్ ఉస్మాన్, భక్తవత్సలరెడ్డి, కరుణాకర్, మునిరాజ్ తదితరులు



సోమశిల: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, సచివాలయ మండల కో ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, ఎంపీడీఓ ఏ మధుసూదన్ తదితరులు

సంక్షేమ పథకాల సృష్టికర్త సీఎం జగన్



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న రాజగోపాల్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

జలదంకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన అందిస్తూ సంక్షేమ పథకాల సృష్టికర్తగా పేరు తెచ్చుకున్నాడని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బ్రాహ్మణక్రాక సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ 100 శాతం నెరవేర్చారని వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. వంటేరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అవినీతికి తావు లేకుండా పథకాలు అందుతున్నాయన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసి శాశ్వత హక్కులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ గ్రామాల్లో కక్షలు రేపేందుకు సిద్ధమైందని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇండ్ల సుధాకర్, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, పార్టీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, ఎంపీడీఓ సింగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పారెడ్డి ఇందిరమ్మ, రావి ప్రసాద్‌నాయుడు, గుర్రం జగ్గయ్య, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, మేకల శ్రీనాథ్‌రెడ్డి, వంటేరు గోవర్ధన్‌రెడ్డి, చేజర్ల హరిబాబురెడ్డి, జిలుమూడి వినయ్‌కుమార్‌రెడ్డి, వేలమూరి వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేజర్ల: తూర్పుపల్లి పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి ఎంపీటీసీ గంగవరం కృష్ణారెడ్డి, నాయకులు కొమ్మి సిద్ధుల నాయుడు, తిరుపతి నాయుడు, శ్రీనివాసులు రెడ్డి, పెంచలరెడ్డి తదితరులు



మర్రిపాడు: పల్లవోలులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, నాయకులు గంగినేని రవీంద్రబాబు, చంద్రా నారాయణస్వామి, పొంగూరు సుధాకర్, సర్పంచ్ బిల్లు పాటి రమాదేవి తదితరులు

73.88 శాతం పింఛన్ల పంపిణీ



బండారుపల్లిలో మందా పెంచలయ్యకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీరు లక్ష్మీదేవి

ఆత్మకూరురూరల్: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ 73.88 శాతం పూర్తయిందని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మొత్తం 4,993 మంది లబ్ధిదారులకు 3,692 మందికి రూ.1,02,25,750 వలంటీర్లు పంపిణీ చేశారన్నారు.



చేజర్ల: వావిలేరులో దివ్యాంగురాలు చావల గాయిత్రికి ఇంటి వద్ద పింఛన్ అందజేస్తున్న వలంటీర్ టి.కళ్యాణ్